క్లుప్తంగా

కలాం విగ్రహ ఏర్పాటుకు ఎంపీ మోపిదేవి నగదు వితరణ



రేపల్లె రూరల్: పట్టణంలో ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహ ఏర్పాటుకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆర్థిక సహకారం అందించారు. విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులకు ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆయన రూ.50వేలు అందజేశారు. ప్రపంచం గర్వించదగిన శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని, ఆయన విగ్రహాన్ని పట్టణంలోని నిజాంపట్నం రోడ్డు మసీదు సెంటరు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

రేపు బషీరు బాబా 18వ గంధోత్సవం



రెడ్డిపాలెం(పిట్టలవానిపాలెం): చందోలు పంచాయతీ రెడ్డిపాలెం సెంటర్‌లో గల బషీర్‌బాబా ఆశ్రమంలో ఈ నెల 20న మంగళవారం 18వ గంధోత్సవం జరుగుతుందని బషీర్‌బాబా శిష్య బృందం తెలిపింది. ఆదివారం విలేకరులతో బృంద సభ్యులు మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా ఆశ్రమంలో షిర్డీ సాయి సహస్ర నామ శాంతిహోమం నిర్వహించి, అన్న సంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు. పలు రకాలైన ఫకీర్ల సన్నాయి, బ్యాండు సంప్రదాయ కార్యక్రమాలతో గంధం, జెండా మహోత్సవం జరుగుతుందని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసంతర్పణ ఉంటుందన్నారు. పరిసర గ్రామాల నుంచే కాక రాష్ట్రంలోని నలు మూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు.

మహాశక్తి దేవతగా బండ్లమ్మ




చందోలు(పిట్టలవానిపాలెం) : చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. మాఘ మాసం రెండవ ఆదివారం కావడంతో అమ్మవారిని మహాశక్తి దేవతగా అలంకరించారు. 50 మంది శివ దీక్షాపరులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించారు. బాపట్ల డీఎల్‌పీఓ తాతా శివశంకర రావు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, బుడ్డా వెంకటలక్ష్మి, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింమూర్తి ఉన్నారు.

ఘనంగా జరుగులమ్మ ఆలయ ప్రతిష్టోత్సవం



జంపని(వేమూరు): జరుగులమ్మ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జంపని గ్రామంలో జరుగులమ్మ ఆలయ పునర్నిర్మాణ కమిటీ, గ్రామ పెద్దల అధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి



బాపట్ల అర్బన్: పట్టణంలోని సత్యనారాయణ పురం శ్రీ రామకృష్ణ సేవా సమితి మందిరంలో ఆదివారం రామకృష్ణ పరమహంస జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ బాపట్ల పట్టణ అధ్యక్షురాలు బండ్రెడ్డి రజిని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మందిరంలోని గురువుకి నూతన వస్త్రాలు బహూకరించారు. రజిని మాట్లాడుతూ ఈశ్వర సమానుడైన రామకృష్ణ పరమహంసకు నమస్సులు అర్పిస్తున్నామంటూ కీర్తించారు. ఈ కార్యక్రమంలో బుర్లే రత్తయ్య, శేషగిరిరావు, సింగారావు, గృహలక్ష్మి, ముద్దుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నవరత్నాలతో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



ఇంటింటి ప్రచారంలో సమన్వయకర్త డాక్టర్ గణేష్, డాక్టర్ కేశవతి

నగరం: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి వాటిని సమర్థవంతంగా అమలు చేశారని రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. మండలంలోని పూడివాడ గ్రామంలో ఆదివారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. ఇంటింటి ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈవూరి కేశవతి, సర్పంచ్ పాగోలు సుజాత, ఎంపీటీసీ మన్నెం పద్మావతి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ బుల్లియ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాగోలు వెంకటేశ్వరావు, పోలిరెడ్డి, సునీల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తూర్పు సత్రంలో భవన నిర్మాణాలకు శంకుస్థాపన



భూమి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలో పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రానికి ఎంతో పేరు ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. ఆదివారం పట్టణంలోని పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రంలో కోటి రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న పురాణ కాలక్షేప, అపరకర్మల భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక దేవాలయాల్లో అర్చకులకు గౌరవ వేతనం అందించామని తెలిపారు. ఇది వారి ఆత్మ గౌరవాన్ని పెంచేందుకు దోహదపడుతుందన్నారు. బాపట్ల పట్టణంలోని తూర్పు సత్రం అభివృద్ధికి తన వంతు సహకారం అందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఇప్పటికే పట్టణంలోని భావన్నారాయణ స్వామి గుడి అభివృద్ధికి చర్యలు చేపట్టామని, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కాగిత సుధీర్ బాబు, జోగి రాజా, ఇనగలూరి మాల్యాద్రి బండి రామ్మూర్తి దేవస్థానం ఈవో వెంకటేశ్వరరావు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగానమ్మ శిఖర వాహన ప్రతిష్ఠ మహోత్సవం

కుచ్చెళ్లపాడు(వేమూరు): కుచ్చెళ్లపాడు గ్రామంలోని గంగానమ్మ శిఖర వాహన ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వరహాపురం వ్యవసాయ సహకారం సంఘం సొసైటీ అధ్యక్షుడు తాడి కొండ శ్రీనుబాబు అధ్వర్యంలో పూజలు నిర్వహించారు. విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వరి కూటి శ్రీ తేజస్, బొల్లిముంత శ్రీనివాసరరావు(కెప్టెన్) గాజుల వెంకటేశ్వరావు, గాజుల నాగ శీర్షిక, పెరికల ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సీహెచ్‌సీలో ఓపీ బ్లాక్ ప్రారంభం

రేపల్లె రూరల్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మించిన స్పెషాలిటీ ఓపీ బ్లాక్‌ను సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వి.సుధాకరం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వకర్త డాక్టర్ ఈవూరి గణేష్ పాల్గొంటారని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లెరూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పోటుమెరక, గంగడిపాలెం, లంకెవాని దిబ్బ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఏడీఈ పి.భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీవారి భక్త ఆత్మీయ సమ్మేళనోత్సవం



ప్రవచనం చేస్తున్న త్రిదండి అష్టాక్షరీ రామానుజ జీయర్ స్వామి

తెనాలిటౌన్: కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గోవింద నామ జపయజ్ఞ పూర్ణాహుతి, వెంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు శ్రీవారి భక్త ఆత్మీయ సమ్మేళనోత్సవం ఆదివారం జరిగింది. భూనీలా సమేత శ్రీనివాసస్వామికి 16రోజుల పండుగ, ఊంజల సేవ, శ్రీనివాస గజపారాయణం, అన్నమాచార్య సంకీర్తనలు, గోవింద నామార్చనలు జరిపారు. మహా మంగళహారతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి (విజయవాడ) విచ్చేసి భక్తులకు ప్రవచనం చేశారు. సాలీగ్రామ మఠం ట్రస్ట్, శ్రీ విద్యాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బాలస్వామిజీ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అన్నామాచార్య సంకీర్తనలు, గోవింద నామార్చనలు అలపించారు. కార్యక్రమంలో టీడీడీ దేవస్థానాల దాసా సాహిత్య ప్రాజెక్టు కృష్ణా గుంటూరు జిల్లాల అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, సాలీగ్రామ మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, సెక్రటరీ ఉప్పల నాగేశ్వరరావు, కోశాధికారి గోపు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎం.రమణయ్య, సభ్యులు పాల్గొన్నారు. శ్రీ విద్యాపీఠం సభ్యులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, పొత్తూరి ఆదిలక్ష్మి శిష్య బృందం సభ్యులు అలపించిన సంకీర్తనలు విశేషంగా అలరించాయి. ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ పర్యవేక్షించారు.

సోషల్ ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన

వెల్లటూరు(భట్టిప్రోలు): ఏపీఎస్ ఎస్‌టీఎఫ్ ఫోరం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని వెల్లటూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన సోషల్ ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన లభించింది. ఆదివారం కూడా విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు అవకాశం కల్పించారు. ఇక్కడ ప్రదర్శించిన ఈవీఎం మిషన్, భారత పార్లమెంట్, భట్టిప్రోలు బౌద్ధస్తూపం, ఢిల్లీ ఎర్రకోట, భారత న్యాయ వ్యవస్థ, బ్యాంకింగ్, చంద్రయాన్-3, నాగార్జునసాగర్, కుతుబ్ మీనార్ ప్రాజెక్టులు విద్యార్థులను ఎంతగానో ఆకర్షించాయి. ఏపీఎస్ ఎస్‌టీఎఫ్ వ్యవస్థాపకుడు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ గుర్రం మురళీమోహన్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్కే సుభానీ నిర్వహించగా, ప్రధానోపాధ్యాయులు కర్రా అరుణకుమారి పర్యవేక్షించారు.

జనం వద్దకే వైద్య శిబిరం

డీ3 శారద సర్వీస్ సొసైటీ వినూత్న సేవ



వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ శారద

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ పుర వేదిక వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ ధర్మ వాహనం ద్వారా ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద నేతృత్వంలో మొత్తం 150 మందికి ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు ఇచ్చారు. రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు, ముఠా కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ.. తమ వంతుగా వారి వద్దకే వచ్చి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మందులు, వైద్య సలహాలతో వ్యాధులు ముదరక ముందే నివారణకు తోడ్పడాలని భావిస్తున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అనుమతితో సాధారణ ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు పూనుకున్నట్లు చెప్పారు. రైతు బజార్లు, జన సంచారం ఎక్కువగా ఉండే కూడళ్లలో మరో అయిదారు రోజులు వైద్య శిబిరాలు నిర్వహించి, నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి గోరంట్లలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు రూరల్: గోరంట్లలో ఈనెల 19నుంచి 22 వరకూ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 22వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని, ఆయన కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

మద్యపానంతో కుటుంబాల చిన్నాభిన్నం

గుంటూరు ఎడ్యుకేషన్: కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసే మద్యపానాన్ని విడనాడాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి పేర్కొన్నారు. కృష్ణబాబుకాలనీలో కళాశాల ఎన్ఎస్ఎస్-3 విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలు, గుట్కా, పొగాకు వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. 21వ డివిజన్ కార్పొరేటర్ కె. గురవయ్య మాట్లాడుతూ మద్యపానం వల్ల కుటుంబాలు ఎంతో నష్టపోతాయని చెప్పారు. కార్యక్రమ నిర్వహణ అధికారి కె. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఎక్కువగా డ్రగ్స్, మత్తు కలిగించే ఆల్కాహాల్ వంటి దురలవాట్లకు బానిసలుగా మారి, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 76వ సచివాలయం సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో మోహన రూపకు కాంస్యం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): కేరళలోని కోజికోడ్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన సీనియర్ నేషనల్స్ ట్రాంపోలిన్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన మోహన రూపకు కాంస్య పతకం దక్కిందని కోచ్ పఠాన్ అఫ్రోజ్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలోని జిమ్నాస్టిక్స్ సెంటర్లో శిక్షణ పొందిందని పేర్కొన్నారు. మోహన రూప ఇప్పటి వరకు తొమ్మిది నేషనల్స్‌లో ఆడి ఉత్తమ ప్రతిభతో పాటు పలు పతకాలు సాధించిందని తెలియజేశారు.



జాతీయ రహదారిపై లైట్లతో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

పెదకాకాని: మండలంలో రోజురోజుకూ మంచు తీవ్రమవుతోంది. ఉదయం ఎనిమిది వరకు మంచు తెరలు వీడటం లేదు. గత పది రోజులుగా తెల్లవారుజామున, ఉదయం జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలు సైతం లైట్ల వెలుతురులో ప్రయాణాలు సాగిస్తున్నాయి. పట్టుమని 50 మీటర్ల దూరంలో ముందున్న వాహనాలు కూడా కనిపించడం లేదు. రోడ్డుపై వాహనాలే కాదు పట్టాలపై రైళ్లను కూడా లైట్లు వేసి నడుపుతున్నారు. ఉదయం ప్రయాణాలు సాగించే ద్విచక్ర వాహనదారులు మంచు కురవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

చేబ్రోలు: నిబంధనలకు విరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని చేబ్రోలు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఒరిస్సా నుంచి చేబ్రోలు మండలం నారాకోడూరుకు గంజాయిని ప్రత్యేక వాహనంలో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఇద్దరు, చేబ్రోలుకు చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రహస్యంగా నారాకోడూరు ప్రాంతానికి వస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులకు చిక్కారు. చేబ్రోలు, నారాకోడూరు, వడ్లమూడి గ్రామాల పరిధిలోని స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు, యువతకు ప్రత్యేక బృందాల ద్వారా గంజాయిని రహస్యంగా విక్రయిస్తున్నట్లు తెలిసింది.

పొలంలో మోటారు చోరీ

తెనాలిరూరల్: పొలంలో విద్యుత్ మోటారు చోరీ గురైంది. ఎస్ఐ పి.కోటేశ్వరరావు వివరాల మేరకు.. పెదరావూరుకు చెందిన కొడాలి రామకృష్ణ తన పొలంలో విద్యుత్ మోటారు ఏర్పాటు చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవరచాలి



గ్రాడ్యుయేషన్ పట్టాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రేపల్లె రూరల్: చిన్నారులకు తొలి గురువులు తల్లిదండ్రులేనని, చిన్న వయస్సులో క్రమశిక్షణతో మెలిగేలా అలవాటు చేయాలని మోంట్ ఫోర్ట్ స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని స్కూల్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో నైతిక విలువలు లేకపోవడంతో కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటు చిన్నారులకు ఇంటి వద్ద తల్లిదండ్రులు నైతిక విలువలు అలవడేలా నడుచుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జాన్‌పాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దహన వాటిక ప్రారంభం



అద్దేపల్లి(భట్టిప్రోలు): మహా ప్రస్థానంలో సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని సర్పంచ్ దారా రవి కిరణ్మయి అన్నారు. ఆదివారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని హిందూ మహా ప్రస్థానంలో రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన దహన వాటిక, దుక్కు ఇనుప బట్టీలను దాతలు బొలిశెట్టి శ్రీనివాసరావు, మద్దుల విజయ్‌కుమార్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. పంచాయతీ తరపున శ్మశానవాటిక అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తూనుగుంట్ల సాయిబాబా, బొలిశెట్టి జయబాబు, పసుపులేటి శివరామ ప్రసాద్, కాశేపల్లి శ్రీనివాస్, తడవర్తి శ్రీనివాస్, బొలిశెట్టి సునీల్‌కుమార్, దీవి నాగేశాచార్యులు, తిరువీధుల బాలాజి, దారా చెన్నయ్య, కట్టా నాగరాజు, మద్దుల గోవిందరాజులు, లక్ష్మీన్నారాయణ, చంద్ర కిషోర్ పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియ పూర్తి

వేమూరు: పంట నమోదు ప్రక్రియ నేటి పూర్తవుతుందని రేపల్లె డివిజనల్ వ్యవసాయాధికారి సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. మండల కేంద్రంలోని పంట నమోదు ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను ప్రభుత్వం ఈ-క్రాప్‌లో నమోదు చేస్తోందన్నారు. రబీ సీజనలో జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము, పంటలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా వాణిజ్య పంటలను కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈకేవైసీ కూడా చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవి విగ్రహ ప్రతిష్ట



బాపట్ల అర్బన్: పట్టణంలో షిర్డి సాయిబాబా గుడి వెనుక ప్రాంగణం నందు ఆదివారం ఉదయం అన్నపూర్ణాదేవి సహిత కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కంచర్లపల్లి రామాంజనేయులు రాజ్యలక్ష్మి దంపతులతో గూడా బొట్టు శర్మ, సాయి స్వామి, దండు కృష్ణ సాయి ఆధ్వర్యంలో శాస్త్రయుక్తంగా జరిగినది. హోమాలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

25న హేతువాద అధ్యయన తరగతులు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో హేతువాద అధ్యయన తరగతులను నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హేతువాద నాస్తిక సాంస్కృతికోద్యమాల అవసరం, జ్యాంగం-పౌరహక్కులు-బాధ్యతలు, నాస్తికత్వం-ఆవశ్యకత, హేతువాదం-శాస్త్రీయత, మానసిక రోగాలు-శాస్త్రీయ వైద్యం, వాస్తు శాస్త్రీయమా? అనే అంశాలపై పౌర హక్కుల సంఘం ముప్పాళ్ల సుబ్బారావు, ముత్తేవి రవీంద్రనాథ్, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ప్రొఫెసర్ కొడాలి శ్రీనివాస్ మాట్లాడతారని తెలిపారు. మూఢ నమ్మకాల నిర్మూలనతోనే సమాజం అభివృద్ధి చెందుతుందనే భావనతో ఏర్పాటు చేస్తున్న తరగతులను జయప్రదం చేయాల్సిందిగా తెలిపారు.

ఘనంగా కనకదుర్గాదేవి ఆలయ ప్రతిష్టోత్సవం



కొల్లిపర: గుడిబండివారి పాలెంలో కనకదుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి, అమ్మవారికి గాజులు, కుంకుమ, చీర సమర్పించారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి గాజులు, కుంకుమ, పట్టు చీర సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మద్యం విక్రేత అరెస్ట్

తెనాలిరూరల్: మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 13 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఉచిత దంత వైద్య శిబిరం



తెనాలిఅర్బన్: తెనాలి దంత వైద్యశాల ఆధ్వర్యంలో రామలింగేశ్వరపేటలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కె.విజయ్ రోగులకు దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంతాల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.